53

# మరపురాని బాధకన్నా మధురమే లేదు!

మన జీవితంలో విషాదాన్ని సూచించే స్వగతాలే మధురమైనవి. ఢిల్లీలో ఓసారి రేడియో వారు ఎందుకోగాని మిమ్మల్ని పిలిచారు. మీ స్నేహితులువచ్చి ఎంతో బలవంతం చేసి గుచ్చిగుచ్చి అడిగితే "తొడుక్కోడానికి మంచిచొక్కా లేదని మీరు రాలేనన్నారు." అముక్క మీరుచెబుతుంటే నేను కిటికీ తలుపు చెక్కకు తల బాదుకుని ఏడ్చాను.

నామొగుడిది దమ్మిడీ ఉద్యోగం. నాది అణాకానీ సంసారం కనుక ఢిల్లీలోఉన్న అయిదేళ్ళూ మీ చేతి ఉంగరం. నామెళ్లో గొలుసూ, మీకు

పెళ్ళికి పెట్టిన నూరు తులాల వెండి కంచం. చాందినీ చౌకులోని గుజరాతీ షావుకారు కొట్లో తాకట్లో వుండేవి. కాలం కరుస్తుంది. ఎంత త్రోసినా నడవనంటుంది. ఎదురు తిరుగుతుంది. తలవంచుకుని అగ్ని పరీక్షలకు నిలబడటం కన్న మనమేమిచేయగలం?

ఒకమారు ఏదో పుస్తకం రాస్తే డబ్బొచ్చిందని ఇద్దరుపిల్లొచ్చాక్క. పేవుమెంటు మీద అమ్మే రెండు స్లాకులూ — నాకొక గళ్ళ గళ్ళ నేత చీర పట్టుకొచ్చారు. మీరనుకున్న పది పన్నెండు రూపాయల ధరలో దొరికింది. అదీగాక నీలంరంగుమీద నలుపుగళ్ళ నేత చీర మీకెంతో నచ్చింది. అది ఒకసారి కాటోలు మడత తీసికట్టుకుని "లూ" గారింటికెళ్ళాను. తరువాత తడిపి కొత్త చీరను ఫెన్సింగు మీద ఆరేస్తే దూడ వచ్చి కపితీరా నమిలి తినేసింది. అది నాకున్న ఒకటే మంచి చీరె అని దూడకెలా తెలిసిందో? నేనేమో నెలలు నిండి కూర్చుంటే లేవలేను. లేస్తేకూర్చోలేను. ఆరాత్రి నేను వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఆ దూడకు సైతం నీకున్నదొకటే చీరని ఎలా తెలిసింది అంటూ నవ్వేరు. మీరు నవ్వుతుంటే నాకు చాలా భయం వేసింది.

నులక మంచాలువేసుకుని వరుసగా దొడ్లో పడుకుంటే రాత్రిళ్ళు పదిగంటల వేళ ఐస్‌లో వేసి తెచ్చిన చెఱకు ముక్కలు తింటూ కబుర్లు చెప్పుకునే వాళ్ళం గుర్తుందీ?

ఒక అర్ధరాత్రి మిమ్మల్ని నిద్రలేపి చెప్పాను. మీరు కంగారుగా వెళ్ళిమంత్రసానిని పిలుచుకొచ్చారు. పురుడు సరిగారాలేదు. నావల్లకాదండి అంది మిడ్ వైఫ్. అప్పుడు టాక్సీమీద నన్ను వెనకసీట్లో వడేసిమీరూ, మన ఇంటివాడు సర్దార్జీ. లేడి హార్డింజి ఆసుపత్రికి చేర్చారు. అప్పుడు నేను స్వర్గనరకాలమధ్య వున్నాను. నన్ను స్ట్రెచర్ మీద పడుకోబెట్టి లేబర్ రూంలోకి తీసుకెళ్తుంటే మీ చేయి గట్టిగా నొక్కి మీవద్దనుంచి

సెలవు తీసుకున్నాను. ఆ పుట్టినబిడ్డను వాళ్ళు నాకు చూపించలేదు. నన్ను ఆసుపత్రి వరండాలో నేలమీద పక్కవేసి పడుకోబెట్టారు. పెసరపప్పు. రొట్టేయించి తినమన్నారు. నాచీరలాక్కుని నాకు ఆసుపత్రి చొక్కా. పరికిణీ కట్టారు. జైల్లో దొంగలకు వేసే డ్రస్సులో వున్నట్లున్న నన్ను చూచి మీరు చాలా భాధపడ్డారు. నాబిడ్డ ఏమయింది.— నాకుచూపించరు దేనికి అంటే ఎవరూ చెప్పలేదు. మృతశిశువు - మగపిల్లవాడే అన్నారు. పోనీనాకుచూపించండి అనిఅడిగాను. నాకుచూపించకుండా మీకు ఆ బిడను రంగు కాగితంలో చుట్టిచ్చారు. ఇవ్వడం నాకు కనబడింది. ఆనెత్తురుగుడ్డును నల్లటి జుత్తును నేను వూహించుకున్నాను. మీరు మృత శిశువును ఏం చెయ్యాలో తెలిక తువ్వాలులో కూరల సంచీలా మూటకట్టి ఎవరికీ అనుమానం కలగకుండా టాంగాలో కూర్చుని యమునానదీ సైకత సీమల్ని చేరుకుని స్వయంగా నది ఒడ్డున గోయితీసి ఆమూట నందులో దింపి మన్ను కప్పి ఇంటికి వచ్చారుట:

ఆమూటను అలా నలిపికట్టి ముద్దగా ఇసకలో కప్పెట్టేసే ధైర్యం మీకెలా వచ్చింది? నాబిడ్డను నవమాసాలూ మోసిన నాకు చూపించకుండా పారేసి వస్తారా? చావలేదేమో ...చావకుండానే మీరంతా హొరబడి పారేసి వచ్చారేమో నది నాకు మనసు పీకుతూ వుండేది. పోనీ - ఆఇసుకలో వదేసేముందు ఒక్కసారి ఆపిల్లాడి ముఖం చూశారూ? పోన్లెండి-నా వస్తువును నాకు చూపించకుండా పారేసినందుకు మిమ్మల్ని నేను క్షమించలేను. ఆ వేళ నేను బ్రతికి ఇంటికి వస్తానని అనుకోలేదు. అందుకే అంత త్వరపడి సెలవు తీసుకున్నాను.

ఈ కష్టాలు వచ్చి మనలను మరీ సన్నిహితులను చేసి పారేశాయి. నూట యాభైరూపాయల జీతంతో ఇద్దరు పిల్లలతో ఒంటిగదిలో కాపురం

చేసే మనకు నెలనెలా సంసారం వెళ్ళదీసేటప్పటికి పరశురామా లైన్ సర్కస్ అయేది.

ఒకనెల ఎవరితోనో వెళ్ళి పచారీకొట్లో అరువుసంపాదించాను. దినవెచ్చాలు, బొగ్గులు అన్నీ నేనే తెచ్చుకునేదాన్ని. ఆకొట్లో తొంభయ్యో వందో అయింది ఓనెల. మిగిలినయాభై రూపాయలూ పట్టికెళ్ళి ఇస్తేతీసుకుని బ్యాలెన్సు అట్టే పెట్టనందుకు సరుకులకి తర్వాత రమ్మనమని తేలిగ్గా మాట్లాడాడు. నేను సామానులు ఇమ్మని బ్రతిమాలినా వాడువినలేదు. వట్టి చేతులతో పిల్లల్నివేసుకుని కొట్టునుంచి తిరిగివస్తుండే లాంతరు స్తంభం దగ్గర ఆపుకోలేనంత దుఃఖం వచ్చింది. స్తంభానికి చేరగిలపడి ఏడ్చాను. మీరూ నేనూ ఏరైలుకిందో తల పెట్టేస్తే సరిపోతుంది. ఇంత అవమానకరంగా జీవించడంకంటే అని ఆవేశ నాకనిపించింది. నేనింటికివచ్చి మిమ్మల్ని వెళ్ళమన్నాను. మీరు వెళ్ళి మరో కొట్లో అరువుపెట్టి సరుకులు తెచ్చారు. అక్కడ మనకు మూడు బట్టల కొట్లలో అరువులుండేవి. అందరూ ఇళ్ళకొచ్చి అన్నీ ఇచ్చి వెళ్ళేవారు. ఇంటినంబరు ఇస్తే చాలు ఏనుగునైనా ఫస్టుతారీకున ఇస్తామంటే తెచ్చి ఇంట్లోపడేసేవారు. కానీ ప్రతి ఫస్టు తారీకుకి వెండి గ్లాసో, పెంటికంచమో, పావగొలుసో ఇంట్లోంచి రెక్కలొచ్చి ఎగిరిపోతుండేవి.

అటువంటి దుష్కర దారిద్ర్యంలోనూ మీరూ, మీస్నేహితులూ నాటకాలు తిరుగుళ్ళు మానలేదు కదా?

మీరెప్పుడూ సంతోషంగా, సరదాగా కబుర్లు చెబుతూ పరమశివునిలా హాలహాలాన్ని గొంతుకలో దిగ మ్రింగినట్లు సంచరించేవారు. ప్యాసులు ఎంత ఫ్రీగా వున్నా ప్రయాణాలకు డబ్బులుండేవికావు. ఒకసారి ఐదురూపాయలు చే బదులు తీసుకొని మీ అమ్మగారికి జబ్బుగా

వుందని షైరు వస్తే అత్తయ్యను చూడటానికి బెజవాడ బయలు దేరాము బెజవాడ స్టేషన్లో దిగగానే మీ జేబులో అణాడబ్బులుకూడా లేవు. మీకు గొప్ప ధైర్యం పెట్టాడు భగవంతుడు — అల్లా కులాసా కబుర్లు చెబుతూ నవ్వుతూ నవ్విస్తూ అగ్నిపర్వతాలు బ్రద్దలవుతూంటే మధ్య నుంచి పెళ్ళాం పిల్లల్ని నడిపించుకు తీసికెళ్ళి పోతారు మీరు? ఇదేమిటంటే — "లక్షాధి కారైన - లవణ మన్నమె కాని మెరుగు బంగారంబు మ్రింగ బోడు" అని మెట్టవేదాంతం చెబుతారు. నగలుచేయించమంటే సినిమా కెళ్దామంటారు. సినిమా అంటే షైరు వెళ్దామంటారు. ఎక్కడికేనా వెళ్దా మండీ అంటే పకోడీలు వండమంటారు. పకోడీలు వేస్తూంటే పీటమీద కూర్చుని ఉత్తుత్తి కబుర్లు చెబుతూ పిల్లలతో ఆడుకోవడం సరదా!

బైట వర్షంపడుతోందో లేదో చేతులుసాచి చూస్తూ పిల్లలకు కాగితప్పు పడవలు, స్టీమర్లు, కత్తిపడవలు చేసి పెడ్తూంటే అప్పుడు ఈ అరువియ్యని షావుకార్లు, దూడనమిలేసిన చీర, రేడియోకి వెళ్ళడానికి చొక్కా లేకపోవడం, ఐదురూపాయలతో ఆలిండియా ప్రయాణం పెట్టుకోవడం యివేమీ జ్ఞాపకంరావు.

మనజీవితం ఎవడో తెలివతక్కువ నాటక రచయిత రాసిన అవక తవక నాటకం కాదుగదా అని అప్పుడప్పుడు నా కనిపిస్తోవుంటుంది.